క్లుప్తంగా

19 మంది రక్తదానం


అమలాపురంలో రక్తదానం చేస్తున్న యువకులు

కొత్తపేట: అత్యవసరమైన పలువురి ప్రాణాలను కాపాడే లక్ష్యంతో స్థానిక వివేకానంద యోగా శిక్షణ కేంద్రం సభ్యులు 19 మంది గురువారం రక్తదానం చేసి, పలువురికి ఆదర్శంగా నిలిచారు. అమలాపురం ఏరియా ఆసుపత్రిలో తలసేమియా రోగులకు, కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు రక్తం అత్యవసరమైంది. దీంతో వారి కుటుంబ సభ్యులు వివేకానంద యోగా శిక్షణ కేంద్రం మాస్టర్ ఆకుల శ్రీనివాస్‌ను సంప్రదించారు. ఆయన తన శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న 19 మందిని అమలాపురం తీసుకువెళ్లి ఆ ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ ద్వారా రక్తదానం చేయించారు. రోగుల కుటుంబ సభ్యులు శ్రీనివాస్‌కు, రక్తదాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా గోదావరి పున్నమి హారతి

ఆలమూరు: జొన్నాడ వద్ద అఖండ గౌతమీ గోదావరి తీరంలో గోదావరి పున్నమి హారతి గురువారం వైభవంగా నిర్వహించారు. వేద పండితుడు ద్విభాష్యం రవికృష్ణశర్మ ఆధ్వర్యాన మహిళ భక్తులు శ్రీదేవి, భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయం నుంచి గౌతమీ పుష్కర ఘాట్‌కు ఊరేగింపుగా చేరుకున్నారు. గోదావరికి పున్నమి హారతి ఇచ్చి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని వివిధ ఆలయాల్లో విష్ణు, లలితా సహస్రనామ స్తోత్రం, కనకధార, అష్టోత్తరం, వేద పారాయణ చేశారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మలికిపురం/కొత్తపేట: లైన్ల వెంబడి చెట్ల కొమ్మల తొలగింపు పనుల నిమిత్తం మలికిపురం, కొత్తపేట మండలాల్లోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. మలికిపురం, లక్కవరం, గొల్లపాలెం సబ్ స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ మద్దూరి సతీష్ తెలిపారు. కొత్తపేట మండలంలోని బిళ్లకుర్రు, వానపల్లి, అవిడి, మోడేకుర్రు, ఖండ్రిగ గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ ఎం.రవికుమార్ వివరించారు.

ముగిసిన ఉపాధ్యాయ శిక్షణ

రాజోలు: బోధన నైపుణ్యం పెంచేందుకు విద్యాశాఖ నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. మండలంలోని రాజోలు కోఆపరేటివ్ స్కూల్, పొన్నమండ ఉన్నత పాఠశాలల్లోని రెండు కాంప్లెక్స్‌ల పరిధిలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. అలాగే మండలానికి చెందిన వ్యాయామోపాధ్యాయులకు రాజోలు బాలుర ఉన్నత పాఠశాలలో శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓ నల్లి మనోహరం మాట్లాడుతూ, విద్యార్థులకు నిరంతరం కొత్త అంశాలపై విశ్లేషణాత్మకంగా బోధన చేసే వీలు ఈ శిక్షణ ద్వారా కలుగుతుందని అన్నారు. పొన్నమండ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రోహిణి తదితరులు పాల్గొన్నారు.

జీఓ అమలు కోసం ఆందోళన

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి దేవస్థానం కేశఖండన శాలలో పని చేస్తున్న నాయీ బ్రాహ్మణుల ఆందోళన గురువారం ఆరో రోజుకు చేరింది. పాత గుడి వద్ద ఉన్న కల్యాణ కట్ట వద్ద వారు నిరసన తెలిపారు. జీఓ 110 అమలు చేయాలని, ఒక్కో నాయీ బ్రాహ్మణునికి ప్రతి నెలా రూ.20 వేల చొప్పున కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. సంఘం అధ్యక్షుడు రామేశ్వరపు నాగ వీర వెంకట సత్యప్రసాద్, కార్యదర్శి పసలపూడి వీర వెంకట దుర్గారావు, గౌరవాధ్యక్షుడు కాజులూరి సత్యనారాయణమూర్తి, కోశాధికారి రామేశ్వరపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పునఃప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభం

కొత్తపేట: స్థానిక బోడిపాలెం సెంటర్‌లో విజయదుర్గా అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ, జీవ ధ్వజస్తంభ, లక్ష్మీదేవి శిలా విగ్రహ ప్రతిష్ఠ, బలి పీఠం, సింహవాహన సంపూర్ణ ప్రతిష్ఠా మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యాన నాలుగు రోజులు పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తొలి రోజున వేద పండితులు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రెండో తేదీన సుదర్శనం వెంకట జనార్దనాచార్యులు ఆధ్వర్యాన బొరుసు వెంకట ఉదయభాస్కర్, వసుధ దంపతులతో విగ్రహాలు, ధ్వజస్తంభం ప్రతిష్ఠ నిర్వహించనున్నారు.

సంస్కృతం అభివృద్ధికి కృషి అభినందనీయం

అంబాజీపేట: సంస్కృత భాష అభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని హెచ్ఎం కె.సాయిరామ్ అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో గురువారం జాతీయ సంస్కృత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్కృత ఉపాధ్యాయిని వాకలపూడి కల్పవల్లి ఆధ్వర్యాన విద్యార్థులకు శ్లోక, గీతా పఠనం, ప్రశ్న మంజూష (క్విజ్), సంస్కృత కథలకు సంబంధించి పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.

ముంగిట్లో ఆధార్

- గ్రామాల్లో ప్రతి నెలా క్యాంపులు
- అందరికీ అందుబాటులో సేవలు
- పెండింగ్ అప్‌డేషన్లకు చర్యలు వేగవంతం


కలవచర్లలో అందిస్తున్న ఆధార్ సేవలను పర్యవేక్షిస్తున్న మండల అధికారులు

ఆలమూరు: వ్యక్తిగత లావాదేవీల నుంచి ప్రభుత్వ పథకాల వరకూ ఆధార్ కార్డు ప్రస్తుతం ప్రతి ఒక్కరికి అత్యంత అవసరంగా మారిపోయింది. 2010లో ప్రవేశపెట్టిన ఈ కార్డును అప్పట్లో ఎటువంటి ఆధారాలూ లేకుండానే మంజూరు చేశారు. దీనివల్ల అక్రమాలు జరిగి, నకిలీ కార్డులు ఉన్నట్టు గుర్తించడంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. పదేళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ ఆధార్ అప్‌డేషన్ (నవీకరణ) తప్పనిసరి చేసింది. లేకుంటే సెప్టెంబర్ నుంచి ఆధార్ కార్డు నిలిపివేస్తామని హెచ్చరించింది. దీంతో ఆధార్ నవీకరణకు జనం క్యూ కడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆధార్ సేవలను మరింత విస్తృతం చేసేందుకు గతంలో గుర్తించిన మీసేవ కేంద్రాలకు అదనంగా నామమాత్రపు రుసుంతో మండలానికి మూడు చొప్పున ఆధార్ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆధార్ అప్‌డేషన్ చేసుకునే వారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఈ సేవలను మరింత విస్తృతం చేయాలన్న ఉద్దేశంతో ఆ బాధ్యతను జాయింట్ కలెక్టర్లకు అప్పగించింది. క్షేత్రస్థాయిలో ప్రతి నెలా ఒక రోజు ఆధార్ సేవలు అందించేందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సులభతరంగా..

గ్రామ స్థాయిలో ప్రతి నెలా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తుండటంతో ఆధార్ సేవలు ప్రజలకు మరింత చేరువయ్యాయి. ఎటువంటి జాప్యమూ లేకుండా నిర్దేశిత సమయంలో ఆధార్ సేవలు అందించడంపై గ్రామీణులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లోని 11 మండలాల్లో 178 గ్రామాలున్నాయి. వీటిలోని 237 గ్రామ సచివాలయాల పరిధిలో ఇప్పటి వరకూ 1.89 లక్షల మంది ఆధార్ కార్డుల అప్‌డేషన్ పెండింగ్‌లో ఉంది. వీటిని త్వరితగతిన పూర్తి చేసేందుకు వీలుగా ప్రతి నెలా నాలుగు రోజుల పాటు ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. గ్రామాల్లో వలంటీర్లు విస్తృతంగా అవగాహన కల్పించడంతో ఆధార్ సేవలను వినియోగించుకునే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది.

ఆధార్ కేంద్రాల్లో అందిస్తున్న సేవలు

ఆధార్‌లో మొబైల్ నంబర్, ఈ–మెయిల్ ఐడీ లింకింగ్, బయోమెట్రిక్ అప్‌డేట్, పేరు మార్పు, పుట్టిన తేదీ మార్పు, జెండర్ మార్పు, ఆధార్ డాక్యుమెంట్ మార్పు, చిరునామా మార్పు, కొత్త ఆధార్ నమోదు, బాలల ఆధార్ నమోదు, చిన్నారుల, పెద్దల బయోమెట్రిక్ అప్‌డేట్.

అప్‌డేషన్ ఎందుకంటే..

- పునర్విభజన నేపథ్యంలో ఏర్పడిన కొత్త జిల్లాల్లో కొత్త చిరునామాలతో ప్రతి పౌరుడూ మార్పులు చేసుకోవాలి.
- చిరునామాలో మార్పులు జరిగితే ఆధార్ కార్డులో సత్వరమే అప్‌డేట్ చేయించుకోవాలి.
- మహిళలకు వివాహానికి ముందున్న ఇంటి పేరును మార్చుకోవడానికి తప్పనిసరిగా అప్‌డేషన్ చేయించుకోవాలి.
- కొత్తగా పెళ్లయిన వారు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో తప్పనిసరిగా మ్యారేజీ సర్టిఫికెట్ తీసుకుని, ఆధార్ కార్డును పునరుద్ధరించుకోవాలి.
- అప్‌డేట్ చేయించుకోకుంటే ఆధార్ కార్డు బ్లాక్ అయిపోతుంది.
- దీనివల్ల ప్రభుత్వం నుంచి లభించే సేవలన్నీ నిలిచిపోతాయి. బ్యాంకింగ్, పోస్టల్, గ్యాస్ వంటి సర్వీసులు ఆగిపోతాయి.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రజల సౌకర్యార్థం గ్రామ సచివాలయాల్లోనే అందిస్తున్న ఆధార్ సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలి. పదేళ్లు దాటిన వారందరూ కచ్చితంగా ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి.

– ఐపీ శెట్టి, తహసీల్దార్, ఆలమూరు

నిజమైన నాయకుడు సీఎం జగన్


గూడపల్లిలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

మలికిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిజమైన నాయకుడని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. మండలంలోని గూడపల్లి, పల్లిపాలెంలో గురువారం జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. గత 75 సంవత్సరాల ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా చరిత్రలో మొట్టమొదటిసారిగా మాదిగలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించిన సీఎం జగన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కేశనపల్లి, తూర్పు పాలెం గ్రామాల్లో కూడా ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో మాదిగ సామాజికవర్గం మరియు ఇతర వర్గాలు వైఎస్సార్ సీపీని మరోసారి గెలిపించాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేయాలని ఇజ్రాయిల్ కోరారు. కార్యక్రమంలో గూడపల్లి సర్పంచ్ సుందర బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

అంబాజీపేట: ప్రస్తుతం వాతావరణ మార్పుల కారణంగా డెంగీ జ్వరాలు ఎక్కువగా వస్తున్నాయని, దీనిపై అప్రమత్తంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు వైద్యాధికారులు వి.గౌతమి, కేవన్ శ్రీనివాస్ సూచించారు. అంబాజీపేట పీహెచ్‌సీలో సీహెచ్‌ఓ బి.అప్పారావు అధ్యక్షతన ఏఎన్ఎంలకు, ఆశా కార్యకర్తలకు గురువారం సమావేశం నిర్వహించారు. వైద్యాధికారులు మాట్లాడుతూ, గ్రామాల్లో ఎవరైనా జ్వరాల బారిన పడితే తక్షణమే వైద్య పరీక్షలు చేయించి, మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.న్నా రు. పీహెచ్‌సీలకు ప్రసూతి కేసులు వచ్చేలా సిబ్బంది బాధ్యత తీసుకోవాలన్నారు. డీఎంహెచ్‌ఓ ఆదేశాల మేరకు ప్రతి నెలా 5కు తక్కువ కాకుండా డెలివరీ కేసులు ఉండేలా చూడాలని సూచించారు. టీబీ, కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించి, వివరాలు సేకరించి, మందులు పంపిణీ చేయాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ సేవలు గ్రామంలోని ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ కె.రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆనందంగా రక్షాబంధన్


ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డికి రాఖీ కడుతున్న మహిళలు

కొత్తపేట/రావులపాలెం/అంబాజీపేట: శ్రావణ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ రక్షాబంధన్ వేడుకలు ఆనందంగా జరుపుకొన్నారు. ఈ శ్రావణంలో పౌర్ణమి తిథి రెండు రోజులు రావడంతో బుధవారం కొందరు, గురువారం మరికొందరు రాఖీ పండగ నిర్వహించుకున్నారు. అంబాజీపేట మండలంలోని పలు గ్రామాల్లో చిన్నారులతో పాటు పెద్దలు కూడా తమ సోదరులకు రాఖీలు కట్టి సందడి చేశారు. రాఖీని కట్టడం ద్వారా తమ సోదరులకు భగవంతుని అనుగ్రహం ఉండాలనే ఉద్దేశంతో.. తమ ఇష్టదైవాలను ప్రార్థిస్తూ సోదరులకు రాఖీలు కట్టారు. అనంతరం ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుంటూ ఆనందంగా గడిపారు. సోదరి అంటే ఎప్పటికీ మరచిపోలేని అనుబంధమని, ఆమెకు ఎల్లప్పుడూ సోదరుడు రక్షగా ఉండాలని.. అందువల్లనే రక్షాబంధన్ రోజున సోదరి రాఖీ కట్టడం ఆనవాయితీ అని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. రాఖీ సందర్భంగా పలువురు మహిళలు గురువారం ఆయనకు రాఖీ కట్టి సోదరి ప్రేమను చాటుకున్నారు. కేతరాజుపల్లి సర్పంచ్ అంబటి సుబ్బలక్ష్మి తదితరులు రావులపాలెం మండలం గోపాలపురంలోని ఎమ్మెల్యే నివాసానికి చేరుకుని, రాఖీ కట్టారు. వారికి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమం.. రెండు కళ్లుగా..

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి
- రావులపాడులో గడప గడపకూ మన ప్రభుత్వం


లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్రంలో పాలన సాగుతోందని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని రావులపాడు గ్రామంలో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి జయశ్రీ ఆస్పత్రి జంక్షన్, రైస్ మిల్లు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి ఇప్పటి వరకూ అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. సంబంధిత పత్రాలను అందజేశారు. సమస్యలుంటే చెప్పాలని, వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని జగ్గిరెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ మట్టా సత్యదేవి, ఎంపీటీసీ సభ్యురాలు దిడ్ల ఆశ, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, కార్యదర్శి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణాలను సులభతరం చేసింది సీఎం జగనే

- ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు
- కౌలు రైతులకు రుణాల పంపిణీ


కౌలు రైతులకు రుణాలందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: రాష్ట్రంలో రైతులకు రుణాలు అందించే ప్రక్రియను సులభతరం చేసింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. ప్రభుత్వం కౌలు రైతులకు మంజూరు చేసిన రుణాలను మండలంలోని గుడిమెళ్లంక గ్రామంలో గురువారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వాలు కౌలు రైతులను ఏనాడూ పట్టించుకోలేదని అన్నారు. కౌలు వ్యవసాయం చేసే రైతులు రుణాలు లేక, ప్రైవేటు రుణాలు చేసి తీవ్ర ఇబ్బందులు పడేవారని చెప్పారు. కానీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కౌలు రైతులకు సైతం పెద్ద పీట వేశారని, కేవలం పంటనే గ్యారంటీగా తీసుకుని రుణాలు అందించే విధంగా ప్రణాళికలు రూపొందించారని వివరించారు. ఫలితంగా నాటి సీఎం చంద్రబాబు దండగ అన్న వ్యవసాయమే ఈ రోజు పండగలా మారిందని అన్నారు. గుడిమెళ్లంక సొసైటీ పరిధిలోని 90 మంది కౌలు రైతులకు రూ.43,90,000 రుణాలను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నల్లి విజయ కుమారి, ఎంపీటీసీ సభ్యురాలు నల్లి అంజలీదేవి, సఖినేటిపల్లి ఎంపీపీ వీరా మల్లిబాబు, సొసైటీ చైర్మన్లు అల్లూరు మహేశ్‌రాజు, యెనుముల నారాయణస్వామి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు సుంకర బాబ్జీ, డీసీసీబీ మేనేజర్ వీవీఎల్ శైలజ, వ్యవసాయ శాఖ ఏడీ రామ్మోహనరావు, మండల వ్యవసాయాధికారి ఎస్.రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీ హయగ్రీవ జయంత్యుత్సవం


మామిడికుదురులో శ్రీలక్ష్మీ హయగ్రీవ జయంతిలో పాల్గొన్న భక్తులు

మామిడికుదురు: స్థానిక శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీలక్ష్మీ హయగ్రీవ జయంత్యుత్సవం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సుదర్శనం సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యాన విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, అభిషేకం, తులసి దళాలు, పెన్నులతో ప్రత్యేక పూజలు జరిపించారు. వేద మంత్రాలు, భక్తుల కోలాహలం నడుమ ఈ కార్యక్రమం ఆద్యంతం కనుల పండువలా నిర్వహించారు. హయగ్రీవుని వద్ద ఉంచిన 10 వేల పెన్నులను విద్యార్థులకు పంచారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని, పెన్నులు, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

జగ్గన్నపేటలో శ్రావణ పౌర్ణమి పూజలు

మొగలికుదురులోని జగ్గన్నపేటలో కొలువు తీరిన శ్రీ చౌడేశ్వరీ సమేత ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ పౌర్ణమి సందర్భంగా దేవాంగ కుల దేవత చౌడేశ్వరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, కుంకుమార్చనలు జరిగాయి. సన్నాయి వాయిద్యాలతో గ్రామ ప్రదక్షిణ ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. అమ్మవారి సారెను భక్తులకు పంచారు.

మాజీ పోలీసు అధికారికి సత్కారం


జేసురత్నాన్ని సత్కరిస్తున్న ఎమ్మెల్యే రాపాక

సఖినేటిపల్లి: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఏపీఎస్పీ మూడో బెటాలియన్ మాజీ పోలీస్ అధికారి గుర్రం జేసురత్నాన్ని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు మండలంలోని మోరిపోడులో గురువారం సత్కరించారు. అంతకు ముందు నా భూమి – నా దేశం కార్యక్రమాన్ని సర్పంచ్ ముప్పర్తి అలివేలు గంగా త్రివేణి అధ్యక్షతన నిర్వహించారు. నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమంలో ఎమ్మెల్యే రాపాక ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు మాతృభూమి కోసం జీవించడమే స్వాతంత్ర్య సమర యోధులకు మనం అర్పించే నిజ నివాళి అని, పుడమి తల్లిని కాపాడుదామని పంచప్రాణ్ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరా మల్లిబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు ముప్పర్తి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

వలియా సేవలు నిరుపమానం

ఆత్రేయపురం: ర్యాలి నంబర్–1 ప్రాథమిక పాఠశాలలో ఎంటీఎస్ ఉపాధ్యాయుడు షేక్ వలియా అందించిన సేవలు నిరుపమానమని యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి సీహెచ్ సుధాకర్ అన్నారు. పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడు వి.సత్యనారాయణరాజు అధ్యక్షతన గురువారం వలియా ఉద్యోగ విరమణ సత్కార సభ జరిగింది. పాఠశాల సిబ్బంది, కాంప్లెక్స్, ఎంటీఎస్ ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సత్కరించారు. యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ బాధ్యుడు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

గోశాలలో అదనపు భవనం ప్రారంభం


గోశాలలో పూజలు చేస్తున్న దాత దంపతులు

అంబాజీపేట: మాచవరంలో శ్రీ కందుల మల్లేశ్వర స్వామి ఆలయం పక్కనే ఉన్న శ్రీ పార్వతీ మల్లేశ్వరస్వామి గోశాలలో దాత సహకారంతో నిర్మించిన అదనపు భవనాన్ని గురువారం అత్యంత వైభవంగా ప్రారంభించారు. మంచాల రామారావు, సీతారత్నం దంపతుల జ్ఞాపకార్థం వారి మనవరాలు పెన్నమరెడ్డి స్వర్ణప్రియ, రమేష్ దంపతులు ఈ అదనపు భవనాన్ని రూ.5 లక్షలతో నిర్మించారని గోశాల వ్యవస్థాపకుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, చైర్మన్ కొత్తూరి గున్నయ్యశర్మ (సిద్ధాంతి) తెలిపారు. ఈ సందర్భంగా స్వర్ణప్రియ, రమేష్ దంపతుల ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణం వద్ద అన్న సమారాధన చేశారు.

కోదండరామాలయ నిర్మాణానికి భూమిపూజ

ఆలమూరు: నర్సిపూడిలో కొత్తగా నిర్మించనున్న శ్రీ కోదండరామాలయ నిర్మాణానికి గురువారం భూమి పూజ జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యాన వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి భూమి పూజ చేశారు. ఆలయ నిర్మాణాభివృద్ధికి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

నల్లా సూర్యచంద్రరావు వర్ధంతి


నల్లా విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పి.గన్నవరం: కాపు రిజర్వేషన్ పోరాట సమితి మాజీ కన్వీనర్ దివంగత నల్లా సూర్యచంద్రరావు వర్ధంతిని స్థానిక అక్విడెక్టు పార్కులో గురువారం నిర్వహించారు. పి.గన్నవరం కాపు సంక్షేమ సంఘ నాయకుడు నల్లా పెదకాపు ఆధ్వర్యాన నల్లా విగ్రహానికి ఆయన కుమారులు అజయ్, సంజయ్, స్థానిక నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. నల్లా సేవలను కొనియాడారు. సర్పంచ్ బొండాడ నాగమణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ కర్రి బాబూరావు, సొసైటీ చైర్మన్ భీమాల సూరిబాబు, నాయకులు పాల్గొన్నారు.

వాడపల్లిలో జానారెడ్డి పూజలు


ఎమ్మెల్యే జగ్గిరెడ్డితో జానారెడ్డి

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ హోం మంత్రి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కె.జానారెడ్డి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఘన స్వాగతం పలికారు. కోనసీమ తిరుపతిగా భాసిల్లుతున్న వాడపల్లి క్షేత్రంలో శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నానని జానారెడ్డి అన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డితో కొద్దిసేపు ముచ్చటించారు.

మహానాగరాజుకు పితృవియోగం

రాజోలు: అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి గజమాల వ్యవస్థాపకుడు చింతా మహానాగరాజు తండ్రి చంద్రరాజు (88) గురువారం వృద్ధాప్యంతో సోంపల్లిలో మృతి చెందారు. ఆయన మృతి పట్ల అగ్నికుల క్షత్రియ సంఘాల సమాఖ్య గౌరవాధ్యక్షుడు సంకరపు ఆదినారాయణ, అధ్యక్షుడు యిల్లింగి వెంకటరమణ తదితరులు సంతాపం తెలిపారు.

లేఖర్ల నిరసన

మామిడికుదురు/అంబాజీపేట: ప్రైమ్–2 విధానాన్ని నిరసిస్తూ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు దస్తావేజు లేఖర్లు చేపట్టిన పెన్‌డౌన్ ఆందోళన రెండో రోజైన గురువారం కూడా కొనసాగింది. లేఖర్లు, వారి సహాయకులు, స్టాంపు వెండర్లు మామిడికుదురు, అంబాజీపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. పాత పద్ధతిలోనే రిజిస్ట్రేషన్లు నిర్వహించాలని కోరారు.

స్కూల్ కాంప్లెక్స్‌లు విజ్ఞాన కేంద్రాలు కావాలి

అంబాజీపేట: ఉపాధ్యాయులు తమ అనుభవాలను పరస్పరం మార్పిడి చేసుకునే జ్ఞాన సముపార్జన కేంద్రాలుగా స్కూల్ కాంప్లెక్స్‌లు ఉండాలని సమగ్ర శిక్ష సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం అన్నారు. అంబాజీపేట మండల వనరుల కేంద్రంలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం గురువారం రెండో రోజు కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బోధనా సామర్థ్యాల మెరుగుదలకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను వినియోగించుకోవాలన్నారు. ఎంఈఓలు కె.వెంకటేశ్వరరావు, ఎం.ప్రకాష్ పాల్గొన్నారు.

ఘనంగా సంచార జాతుల విముక్తి దినోత్సవం

మామిడికుదురు: సంచార, అర్ధ సంచార జాతుల విముక్తి దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు చెల్లింగి త్రినాథరావు ఆధ్వర్యాన మామిడికుదురుకు చెందిన బుడగజంగాల కుల పెద్దలు ఇంగువ పెద్దిరాజు, ఇంగువ ఏడుకొండలును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ, జిల్లా కార్యదర్శి పసుపులేటి మహాలక్ష్మీరావు, కిసాన్ మోర్చా ఐటీ సెల్ జిల్లా కన్వీనర్ కటికిరెడ్డి తమ్మయ్యనాయుడు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి చర్యలు


విలేకర్లతో మాట్లాడుతున్న సర్పంచ్ శాంతకుమారి

అంబాజీపేట: డంపింగ్ యార్డు కోసం అనువైన స్థలాన్ని సేకరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని మాచవరం సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి తెలిపారు. పంచాయతీ కార్యాలయంలో పాలవర్గ సభ్యులతో కలిసి ఆమె గురువారం విలేకర్లతో మాట్లాడారు. చెత్త వేసేందుకు హడ్కో కాలనీ, మాచవరం వాసులు అడ్డుకోవడంతో మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, కలెక్టర్ హిమాన్షు శుక్లాకు సమస్యను వివరించామని గుర్తు చేశారు. ఆ కాలనీ వాసులతో చర్చించి, మూడు నెలలు గడువు ఇచ్చారన్నారు. ఆలోగా స్థలం సేకరించాల్సి ఉందని, అయితే ఎక్కడా ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలు దొరకలేదనే విషయాన్ని ప్రజాప్రతినిధులకు, అధికారులకు వివరించామని చెప్పారు. స్థలం కోసం అన్వేషిస్తున్నామని, సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. చెత్త వేసేందుకు స్థల సమస్య ఉందనే విషయం తెలిసి కూడా కొంత మంది మహిళా సర్పంచ్ అని కూడా చూడకుండా విమర్శలు చేయడం తగదని శాంతకుమారి అన్నారు. గ్రామాభివృద్ధికి ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారం ఎంతో అవసరమని చెప్పారు. విలేకర్ల సమావేశంలో పాలకవర్గ సభ్యులు యలమంచిలి బుచ్చిబాబు, గోసంగి సత్యనారాయణ, కొర్లపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.